# "గుడ్డిగానడుస్తే గోతులో పడ్డమే"

శ్రీమతి ఆచంట సత్యవతమ్మగారు

నవనాగరిక యుగమగు నీ యిరువదవశతాబ్దములో కూడా మనదేశము సగముకన్నే తెరచుట వింత కదా? శోచనీయంకూడను. అన్ని దేశపరిస్థితులు అవలోకించుచుగూడ కొన్నివిషయాల్లో వివేకహీనంగా గ్రుడ్డిగా నడవడమేనా? దీనికి కొన్ని కని వినిన సంగతులు తెలుపుచున్నాను వింటే.

ఏవూళ్లోనో యొక బైరాగి యిం టింటికివెళ్లి ఒక్క నోటుయిస్తే (అంటే ప్రాంసరీనోటుకాదు. రూపాయిలనోటు) వేలకువేలు నోట్లుచేసి యిస్తానంటే, లోకులునమ్మి వేలకువేలు గుప్పేసి, అవి తీసుకుని వాడుడాయిస్తే నోరు నెత్తి కొట్టుకొని యేడ్చియూరకున్నారట.

ఇంకోచోట ఒక ఘోషాయివెళ్లి ఒకశక్తి మీ యూరుప్రవేశించి తెల్లారేసరికి మీపశువులను చంపేస్తుంది. నేను దివ్యదృష్టిని పరికించిచెప్పాను. ఏదో కొంతసొమ్మిస్తే, శక్తిని పారదోలేపూజ చేస్తానంటే, కొందరు నమ్మి డబ్బిచ్చినారట. కొన్నియూళ్లల్లో నమ్మక పోపొమ్మంటే, రాత్రికిరాత్రి రెండుమూడు వీధుల పశువులకింత విషమిచ్చి చంపేసినాడట. మరునాడు వారివారిపశువులు చచ్చియుండడముచూచి, సన్యాసినినమ్మక యింత తెచ్చుకున్నామని విచారించి వానినివెదకి తీసుకువద్దామని వెతకబోయినారట. ఇంతలో పశువులకు మందుపెట్టుటచూచి, సన్యాసిని మెత్తగా తన్నుచున్నారట. వెదకబోయినవారీ దృశ్యముచూచి వారితోకలసి తన్ని, వాడిచేతనే విరుగుడుపెట్టించి పశువులను బ్రతికించుకున్నారని వదంతి విన్నాము.

మావూళ్లో ఓఅమ్మాయి, పిల్లలకోసము తపించి, చూచినరాతికి పుట్టకుమ్రొక్కి, నోములు, తీర్థయాత్రలు, ఉపవాసములు, అశ్వత్థప్రదక్షిణములు ఎన్నో చేసి ఫలంలేక, వారి వీరివలన యేవూళ్లోనో యొక సన్యాసి కలడనియు, వాడే కోరికకోరితే నది తీర్చే అపర బ్రహ్మావతారమని విని, పతిసహితంగా ఆ సన్యాసివద్దకేగి ఫలదక్షిణాలచే తృప్తిగావించి, తమ సంతానకోరిక దెల్పగా ఘోషాయిచిట్కాఅంటారే, ఆలా ఒకచిట్కా మందిచ్చి యిద్దరిని సేవించమన్నాడట. అది తిన్నతక్షణంనుండి, మగవాడు మంచమెక్కి నెలతిరగకుండా చచ్చిపోయినాడు. తదాదిగా భార్యకు పిచ్చెక్కి తిరుగుచున్నది. సంతానములేదు చట్టుబండలులేదు—కాని చావుకాక బ్రతుకు కాకుండా వితంతువై తన్నుతానే యెరక్కయున్న దా అమ్మాయి. విన్నారా?

కొంతకాలంక్రింద జరిగిందిది. రాజమండ్రీ ఇన్నీసుపేట పడవలరేవుదరి నొక కోమటిముసలిదొక చిన్న చిల్లరదుకాణము పెట్టుకొని, జీవించుచు ఏదో కొన్నివందలరూపాయలు జేసికొంది. చేతికి బంగారు మురుగులు చేయించుకొంది. దానికి తోడొకముసలిది కాపలా. ఈ ఆడంగులసంగతి గ్రహించాడొక మోసగాఁడు. రాత్రి 10 గంటలప్పుడొక పూజారివలె ఇన్ని పువ్వులు దేముఁడు నివేదనమని పళ్ళు, కొబ్బరిచెక్కలో పట్టుకొచ్చి యీముసలాళ్లకిచ్చుకాలు (అంటే ఏవోపురాణకథలు) అవి చెప్పి నమ్మకంకలిగించుకొని ప్రసాదములు పెట్టుచుండె ధనుర్మాసపు సేవ యొక్క ప్రసాదమని పులిహోర, వడలు, చక్రపొంగళ్ళు దధ్యోజనం, కమలాఫలములు వగైరాలిచ్చి

యొకనాడింత సగ్గుబియ్యపు పరమాన్నమూ యిద్దరి ముసలాళ్లకీ పెట్టినాడట. వాడుకప్రకారం మది వాళ్లు త్రాగారు. వెంటనే మత్తెక్కి పడినారు. అసలు దుకాణపుది స్మృతిలేకుండానే యుండుటచే దాని చేతిమురుగులు తీసికొని పెట్టెలోని సొమ్ము తీసుకొని పరారైనాడు. రెండవదానికి తినగానే డోకులు వెళ్లినవి. అందుచే అంతమత్తుగాలేక యివన్ని కలలో కన్నట్లు చూస్తూందిటకాని, నోరులేదు కదలలేదు. తెల్లవారేసరికి, దుకాణపుది పిచ్చెత్తినదానిలా తయారైంది. కళ్లచూపేకాని నోటిమాటలేదు. చేతులు కాళ్లు పీకికొనుట, లేవబోవుట యీలాయుంటే చుట్టుప్రక్కలవాళ్లందరు పోగైహాస్పత్రికి తీసికొనిపోయి వాండెట్టినమందుకు విరుగుళ్లు చేయిస్తే సెమ్మదించి జరిగినవన్నీ చెప్పినది. పోలీసులకు రిపోర్టుయిచ్చినారు. కేసు జరిగింది. ఆరకపు పూజారి తెనాలిలో పట్టుపడ్డాడని వినికిడైంది. యీలాగేయుంటాయి గుడ్డి నమ్మకాలు.

ఇట్టిమోసములు పెద్ద పెద్దపట్నాల్లో మరీగురుక్కువ. ఎవరిని నమ్మేరోజులు కావివి. ప్రజల గౌరవపాత్రులగు యోగీశ్వరులవేషాలతోయున్న ప్రతివ్యక్తిని గ్రుడ్డిగా అసలే నమ్మకూడదు. యింటియజమాని యొక్క స్వహస్తలిఖిత రూపకములేనిదే స్త్రీలు, నౌకర్లను, చాకర్లను, జోగులను యెవరిని నమ్మకూడదు. ఆఖరికి యెరిగియున్నవారినైనా నమ్మకూడదు.

మాబంధువులో యొకరింటికి భిక్షచేయమని ఒక స్వాములవారొచ్చారట. ఆస్వామికి ఒక కాలు విపరీతపు బోదకాలు పైగా వర్షాకాలమగుట యింత బురదకాళ్ల కంటుకొనెను. కాళ్లు స్వాములవారికి భిక్షసేయువారు పాదపూజసేయు సందర్భమున కడగాలని నియమ మున్నదిలెండి. అందుచే ఆబురదకాళ్లతోవచ్చి పీటమీదకూర్చుని పాదపూజ చేయమన్నాడట. ఆయింటి యజమానురాలా కాళ్లుకడుక్కొని రమ్మనెనట. ఆ మాటకా స్వామిజీకి కోపమువచ్చి, భక్తుల కసహ్యమేల? నాకాళ్లేలాయుంటే ఏమి అవే కడిగినపాదతీర్థము తీసుకోవలసిందేకాని, అడ్డుచెప్పిన చోట నేను భోజనముచేయనని చివాలున లేచిపోయినాడట. భోజనసదుపాయముల కొఱకైన సాపాటు స్వాములుకాని సర్వసంగ పరిత్యాగులా యిప్పటి సన్యాసులు?

మరియొకవింత. ముఖ్యంగా వినండి, ఆమధ్య దిగంబరస్వామి మావూరొచ్చి నడిగోదావరిలోయున్న యిసుకతిప్పమీద బసచేసాడు. పదిమందిశిష్యులు, పంచాగ్ని మధ్యనివాసము, పుట్టెడువిభూతి పూత, నల్లమేఘచ్ఛాయనుమించు రంగుకలిగి, ఉక్కుగుండును దిగత్రొక్కు శరీరము, మౌనవ్రతం. రాత్రింపగళ్లు సమాధికాని కన్నుచూపులేకుండుట ఆయనదేభాషోకాని, యేదేశభాషా రాదేమో మాటే లేకపోవడం. నీరైనా స్వీకరించినట్లు కనబడకపోవడం. విరాగిఅంటే యీయనేఅన్నట్లున్నాడు. స్వామంటే స్వామి కాదురా? పిల్లలులేనివాళ్లకు పిల్లలు, రోగాలున్నవి పోగొట్టడం, కళ్లులేనివాళ్లకు కళ్లు యీలా ఒక్కచిటిక విభూతితో సకలరోగ నిర్మూలం చేయుచున్నాడని శ్రీపురుషాదులదేపోత వేలంవెర్రిగా. ఒక్కఫలమైన ముట్టనియోగిని పళ్లుదక్షిణలతో ముంచెత్తారు. సాష్టాంగదండములతో యిసుకంతా పల్లమైపోయింది. వైతరణినది దాటితేనే కాని, జీవులు యమలోకం చేరరన్నట్లుగా కొంత గోదావరినది దాటితేనే కాని జనులా యతీశ్వరుని సన్నిధిచేరరు. దీనితో పడవవాళ్లు, బళ్లవాళ్లులా గ్రాలోకులసొమ్ము మిగిలిందది స్వామికి సమర్పణ. ఈ సమర్పణాఫలములగుట్ట అసలే నీరైనా ముట్టనిసంయము డేమితింటాడు? శిష్యులున్నారుకాదు కంపెనీ యేజెంట్లవలె. వారుతిని వచ్చినవారికి ప్రసాదముల క్రింద యిచ్చి ధ్యానానందస్వామివంటి విభూతింతతీసి, కోర్కెదారులకొసగి పంపించుచుండిరి. వెర్రి నమ్మకాలు, అయ్యలు ఎంతమహానుభావుడు కాకపోతే, నిరాహారుడైయుండి గుండులాగే యున్నాడంటే

కబుర్లు ఆనోటనోట వింతలే. ముసలిచ్యవనుని అశ్వినీకుమార్లు యువకునిచేసినరీతి గా నీతని దలచుచుండిరి. అందరినోటమ్మట, టకారములేకాని, స్వానుభవను లెవరూ గన్పించరు.

ఇంతలో చనిపోయిన తునిరాణిగారా యోగిని తమయూరు రమ్మని కబురంపినదట. అందుకై రైలులోపోవుచుండగా పోలీసులు అనేకచోట్ల ఖూనీలు చేసి, మారువేషమున తప్పించుకొని తిరుగుచున్న హంతకునిగానెరిగి బంధించిరని ఇంగువవాసనలా వార్తలు బయలుదేరాయి. ప్రజలను మోసబుచ్చగలడు కాని, భగవంతుని పసిపట్టుటలో పంచానన సమానులగు పోలీసులను గికురించగలండా? ఉల్లిపువ్వు ఉల్లిపువ్వే. మల్లిపువ్వు వాసనొచ్చునా? రోగాలుకుదిర్చినా కుదర్చకపోయినా డబ్బురోగం కొంతవఱకు కుదిర్చాడు హంతకయోగి. ఇన్నివిన్నా కళ్లుతెరవరే ప్రజలు.

ఇదయ్యాక మాయూరే ఇంకో స్వాములారు వచ్చారు భగవద్గీతాసార ముపన్యసించుటకు. చాలా బాగా చెబుతున్నాడని, ఒక్కకానిదైనా పుచ్చుకోడని, పళ్లె మసలేలేదని వదంతులతో జనులదే పోత. పదిహేడురోజులు పదిహేడధ్యాయాలు చెప్పాడు. ఇంతవఱకొక్క గవ్వయినా రాలేదు కంఠశోషే కాని. అడుగుటకా నామర్దా. ప్రజాభిప్రాయం తారుమారై గౌరవం తగ్గుతుంది. అడక్కపోతే అమ్మైనా పెట్టదు. ఈలాంటి చిక్కుల్లో పడ్డాడు మహానుభావుడు. ఈ పదిహేడురోజుల నుంచి విడవకుండా సేవించుచున్న యొకాయనకు తన దీనత చెప్పుకొన్నాడో ఏమో పద్దెనిమిదోరోజులచివర కాలమం దందుకున్నాడు శిష్యుడు డబ్బుప్రస్తావన. "స్వామియొకమఠం గోదావరితీరమున స్థాపించదలచుకొన్నాడు. ఆయన తలంపన్యథాచేయుట మనకు చాలా అగౌరవం గాన" అనేసరికి ఎమ్టిహోండు (వట్టిచేతుల)తో వచ్చినజనులెల్లరు చల్లచల్లగాజారేరు. ఆవేళే క్రొత్తగా చూడాలనివెళ్లిన మేమున్నూ వారి ననుసరించాము. ధనముగ్ధుడు కాని, నిష్కామయోగవడో తెలియకుండా యున్నది. మోక్షసన్యాస యోగదినము గనుక స్వామికి శుద్ధమోక్షమై, తెల్లవారుగట్ల వెడలిపోయినాడు.

బందరులో నామధ్య యొకవేదాంతివచ్చి స్త్రీపురుషాదులకా వేదాంతవిద్య యుపదేసిస్తానన్నాడట. గుడ్డినమ్మకాల్లో, స్త్రీలగ్రగణ్యలగుటచే యొకటే వెర్రిపోతగా పోవగాపోవగా, కొన్నిరోజులకొక యవ్వనవితంతువు కుపదేశ సెపంబున నేవో యవాచ్యములు పల్కాడట. అది యూరంతాప్రాకి ఆవేదాంతిని తన్న దలపెట్టారట యూరిపెద్దలు. అదితెలిసి, పలాయనసూత్ర మవలంబించాడా వెర్రివేదాంతి. మాయదారి ప్రపంచాన్ని కళ్లు బాగాతెరచి విమర్శనగా నడవాలికాని గ్రుడ్డిగానడుస్తే గోతులోపడ్డమే. ఇక్కడి కిదిసరి.

మరోవింత. మరీవింత. వెనుకటికో సన్యాసి, ఆరవేసికొన్న గోచిగుడ్డ ఎలుకలు కొఱుకుచున్నవని, వాటిని చంపుటకో పిల్లిని, పిల్లినిపెంచుటకై పాలుకావలసి ఆవును, ఆవు సంరక్షణకొక నౌకరును, ఇన్నిటిని కనిపెట్టుటకొక స్త్రీని పెండ్లాడి తుదకొక సంసారి మేర్పరచుకొన్నాడట. ఆలా ఈమధ్య అంటే సుమారెనిమిది నెలలనుంచి మాయూరే (అన్నివేళంవెర్రులకు అగ్రపీఠం లెండి) వచ్చి, మఠాలలోను, గుళ్లలోను, అధ్యాత్మరామాయణ మతి సారస్యంగా అంతరార్థ బాహ్యార్థము లాకాశమంటే నేర్పున చెబుతున్నాడు. మాట మైసూరుపక్కే ఏసమాసైనా మారచనగా, విపులంగా చెబుతున్నాడులెండి. వినేవాళ్లలో మూడువంతులు స్త్రీలే. వారిలో మూడువంతులు వితంతువులే. వితంతువులకే యతిస్వతంత్రము కాదా? తత్త్వబోధ తరుణుల తలనపాల మంటుచున్నది. సన్యాసిగా ఆశాకోపము లాకాశమంటుచున్నవి. డబ్బులేని [illegible] డబ్బుతేగలరు. అందులో పురుషుల [illegible],

సినీమా నాటకాలకు, సూటుబూట్లకు, షోకులకు పోగా మిగిలితేను. వారనుగ్రహించి యిస్తేనుగద మగని వక్షస్థలంవీడనిలక్ష్మి స్త్రీ పాలబడుట. అందులో వితంతుల కేకొడుకో, ఏమరదో, ఏ అన్నతమ్ములో, మరదలో, కోడలోయియ్యాలి దయదల్చి. ఇందరిచేతులమీదనుంచి రావడం, స్వామికివ్వడం అరుదగుచుండుటచే, నాస్వామికి ధర్మోపన్యాసకంఠశోషకు కడునలిగి, పళ్లెముంచాడు. అదీ నిండుటలేదు. ముఖాముఖిగా అడిగాడు. అన్నికోరికలువిడిచిన సర్వసంగ పరిత్యాగియైన యతీశ్వరునకీ తుచ్ఛధనముతో పనేమని యెవరో అన్నారట. అంటే ఆయన అపరదూర్వాసుడై, "రైలువాళ్లు నన్నూరికే ఎక్కించుకుంటారా? అద్దియివ్వక పట్నంలో యిల్లెవరిస్తారు. పదార్థములులేనిదే పాకమెట్లు భుజించను. కడుపు నిండనిదే గాథలెట్లు మీకు చెప్పను. గనుక, రోజు తలకొక అర్ధణా కాని, మొత్తము నెలదాకా యివ్వలేకపోతే నెలకొకరూపాయిగా మొత్తపరచిగాని తేవలె"నని అట్లా తెచ్చేవారు చేతులెత్తమని, అన్నాడని వదంతిపుట్టింది. పైగా విభూతి పెట్టుకోకుండా వితంతువులు రావలదనిశాసిస్తే, ఇంత విభూతిలేకుంటే సిగ్గేస్తుంది స్వామీ అందిట ఓముసలావిడ. ఆలాగా మంగలాడివద్ద క్షౌరమునకు తలవంచి కూర్చొనుటకు సిగ్గులేదా అన్నాడట తక్షణం. ఇంకోఆవిడ పళ్లెము పట్టి స్వామికి చందా వసూలుచేసి రోజూయిస్తూంటే డబ్బులు తీసుకున్నావని దొంగతన మారోపించగా ఆవిడ మళ్ళీవెళ్లలేదని స్వయంగాతెల్పింది. ఇన్నిరకాలుగా చెప్పుకుంటూనే వెడుతున్నారమ్మలు. ఏమర్రా అంటే, అసలు చెప్పే యతికున్నా లేకపోయినా, దేహాభిమానం ఎందుకు ఇన్నివింటూ అన్నారు కొందరక్కలు, పురాణవైరాగ్యముగా.

భిక్షలకు పిలవలేదని యొకకోపము. పిలిచిరిబోగాటీలు బాగులేవనియో, గంధము తీయలేదనియో, దక్షిణ చాలదనియో,వంట రుచిలేదనియో, పిండివంట తనకిష్టమైనవి కాదనియో కోపముతో అలుగుతాడని వదంతులు. పాపం పుణ్యం భగవంతునికెఱుక. ఏమయినా, కోపంమాత్రం తగదు. సన్యాసికిన్ని చింతలెందుకు? ఆహారవిహారములికింత హడలెందుకు? డబ్బుకై యింత కాంక్షెందుకు? ఆత్మసంయమునకు సత్రం భోజన, మఠానిద్ర యుండాలి. ఆరోజు కేది ప్రాప్తో, అది తినాలికాని ఆకాశహర్మ్యాలెందుకు? లోకహితార్థమై తన జ్ఞాన మన్యదాపోసీయక, వినియోగించు పుణ్యాత్ములకీ యుపాధినిలుచుటకే పండో భక్షించి జ్ఞానదేహాభివృద్ధితోజీవించి జ్ఞానయోగసాధనములచే దేహాభిమానంవీడి దుక్ దృశ్యము లేకముగా చరించి ధన్యులై లోకమును తరింపఁజేయుటయై యుంటయే, సన్యాసుల లక్షణంకాని చవట సన్యాసిరా యనిపించుకొనుట యతికులంబుకొక లోపమని మనవి.

మనుజులపరికించి మరీ మసలాలని మామగువలకు మనవి. నామాటల కలుగవలదనియు, నిజమాడిన నిష్ఠూరము వలదనియు పురవాసులకు మనవి. అంధత్వమున కధఃపతనమే యని హెచ్చరిక. మామనవిని మంచిగా గ్రహించిన మహనీయుల కనేకవినతులని మనవి. ఉన్నసంగతేకాని దూషణకాదని మరిమరి మనవి.